

చీనీ టన్ను రూ.38,650

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38,650 పలికాయి.



టమాట కిలో రూ.26

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.26 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

32.5°/13.7°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలివాతావరణం నెలకొంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పరిశ్రమలతోనే జిల్లా సమగ్రాభివృద్ధి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివనారాయణశర్మ

అనంతపురం అర్బన్: పరిశ్రమల ద్వారానే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలని చెప్పారు. సింగిల్‌విండో పోర్టల్ ద్వారా చేసుకున్న దరఖాస్తులకు అనుమతులు నిర్ణీత వ్యవధిలో ఇవ్వాలని ఆదేశించారు. పీఎంఈజీపీ ద్వారా రుణం మంజూరైన యూనిట్లు అన్నీ గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా వినియోగించుకోవాలని సూచించారు. ఇండస్ట్రియల్ పాలసీలో భాగంగా యూనిట్ల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌బీ అభ్యర్థుల కోసం ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు : ఆర్‌ఆర్‌బీ (రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు) పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24, 25, 26, 27వ తేదీల్లో హుబ్లీ–కర్నూలు సిటీ (07315) మధ్య నడిచే ఈ ఎక్స్‌ప్రెస్ రైలు హుబ్లీ జంక్షన్ నుంచి రాత్రి 8.15 గంటలకు బయలదేరి కర్నూలు రైల్వేస్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 6.00 గంటలకు చేరుతుందని పేర్కొన్నారు. తిరగి ఈ రైలు ఈ నెల 25, 26, 27, 28వ తేదీల్లో ఈ రైలు కర్నూలు రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 7.30 గంటలకు బయలుదేరి హుబ్లీ జంక్షన్‌కు సాయంత్రం 4,15 గంటలకు చేరుతుందని తెలిపారు. ఈ రైళ్లు గదగ్, కొప్పల్, హోస్పేట్, తోర్నగల్, బళ్లారి, గుంతకల్లు, డోన్ మీదుగా రాకపోకలు సాగిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆకతాయిల ఆటకట్టు




ప్రమాదకర రీతిలో బైక్ రైడ్ చేస్తున్న ఆకతాయిలు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం: రోడ్లపై బుల్లెట్‌లా దూసుకెళ్తూ ప్రయాణికులను, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆకతాయిలను రాప్తాడు పోలీసులు ఆటకట్టించారు. 650 సీసీ బైకులతో బైక్ రైడింగ్ చేస్తున్న మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'రయ్‌మంటూ హడలెత్తిస్తూ..' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎస్పీ స్పందించారు. తక్షణమే ఆకతాయిలపై దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాప్తాడు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తొమ్మిది మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పునరావృతం అయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కసాపురంలో అర్ధ మండల దీక్షలు ప్రారంభం



మాలధారణ చేస్తున్న వేదపండితులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం హనుమాన్ అర్ధ మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. వేకువజామునే ఆలయ ముఖమండపంలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు, అర్చకులు హనుమాన్ మాలధారణ కార్యక్రమాన్ని చేపట్టారు.





వేదికపై ఆసీనులైన సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ బృందం,సత్యసాయి యూనివర్సిటీ ప్రముఖులతోపాటు ముఖ్య అతిథి సేతురామన్ పంచనాథన్, స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సత్య మందిరం.. జ్ఞాన సౌరభం

అంబరం.. స్నాతక సంబరం

- ఘనంగా సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న సేతురామన్ పంచనాథన్
- సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపు
- 463 మందికి పట్టాల అందజేత
- 22 మందికి బంగారు పతకాలు, 14 మందికి డాక్టరేట్లు ప్రదానం



మెడల్స్‌తో సత్యసాయి మహాసమాధి చెంత విద్యార్థులు

ప్రశాంతి నిలయం: అంతర్జాతీయ ఆధ్యాత్మిక ధామం ప్రశాంతి నిలయంలో విద్యాసౌరభాలు విరబూశాయి. సత్య మందిరంలో జ్ఞాన కాంతులు ప్రకాశించాయి. స్వర్ణపతకాలు దక్కిన వేళ ప్రతి విద్యార్థి మోములోనూ ఆనందం వెల్లివిరిసింది. బిడ్డల పట్టాభిషేకం చూసి తల్లిదండ్రులు ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. ఈ అద్భుత ఘట్టానికి పూర్ణచంద్ర ఆడిటోరియం వేదికైంది. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవం శుక్రవారం ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. వర్సిటీ చాన్సలర్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవానికి యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో 463 మందికి పట్టాలు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 22 మందికి బంగారు పతకాలు, మరో 14 మందికి డాక్టరేట్లు ప్రదానం చేశారు.

'ఐ ఓపెన్ కాన్వొకేషన్' అని పలికిన సత్యసాయి..

సత్యసాయి జయంత్యుత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూర్ణ చంద్ర ఆడిటోరియంలో స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్, బోర్డు డైరెక్టర్ల బృందం పూర్ణ చంద్ర ఆడిటోరియానికి ర్యాలీగా చేరుకుంది. అనంతరం ఫౌండర్ చాన్సలర్ సత్యసాయిబాబా 'ఐ ఓపెన్ కాన్వొకేషన్' అంటూ డిజిటల్ స్కీన్ ద్వారా ప్రకటించారు. అనంతరం వేడుకలు ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘువేంద్ర ప్రసాద్ యూనివర్సిటీ వార్షిక నివేదికను వెల్లడించారు. అనంతరం మాట్లాడుతూ.. సత్యసాయి ఆశయాలకు అనుగుణంగా మానవతా విలువలు, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కలగలిపి ఆధునిక గురుకుల విద్యావిధానం ద్వారా సత్యసాయి విద్యాసంస్థలలో ఆదర్శమైన విద్యను ఉచితంగా అందిస్తున్నామన్నారు. నేటి సమాజ అవసరాలకు అనుగుణంగా నూతన అవిష్కరణలు, పరిశోధనా రంగాల వైపు దృష్టి కేంద్రీకరించామన్నారు. 2020 జాతీయ విద్యా విధానం మేరకు కొత్తగా ఐదు కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. బీఈ మ్యాథమ్యాటిక్స్ అండ్ టెక్నాలజీ, డాటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోసైన్సెస్ అండ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులోకి తెచ్చామన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే గేట్స్, సీఎస్ఐఆర్, యూజీసీ, నీట్ తదితర పరీక్షల్లో సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటుతున్నారన్నారు. అనంతరం చాన్సలర్ చక్రవర్తి అడ్మిషన్ ఆఫ్ గ్రాడ్యుయేషన్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్నాతకోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.

ప్రతిభకు పట్టాభిషేకం..

స్నాతకోత్సవంలో భాగంగా వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 22వ మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. బంగారు పతకాలు పొందిన వారిలో దీశెట్టి సాయి నందన్, పోడూరు శేష సాయి, హెచ్ శ్రీరాం, కొప్పోలు మణికంఠ, ఆకాశ్ బైరాగి, సత్యనారాయణ నారాయణ, సాహిల్ ప్రధాన్, అగవేంటి భార్గవ్, జుట్టు ఆదర్శ వర్మ, మైనక్ ముఖర్జీ, కోళ్ల వినయ్ సాయి, విక్రమ్ కృష్ణ, రితు రాజ్ ప్రధాన్, మద్దూరి సాయి శ్రీ దత్తా, కుమారి యుక్తి భరద్వాజ్, నేతేటి కేశవాణి, గుగ్గిలం శ్రీచందన్ కృష్ణ, బెల్లపు రవ్వల శ్రేయ, చెరుకూరి సాయి కార్తిక్, శ్రీరామ్ కోరి, నితిన్ నిత్య హర్ష ఉన్నారు. వీరికి యూనివర్సిటీ చాన్సలర్ చక్రవర్తి, ముఖ్య అతిథి సేతురామన్ పంచనాథన్ పతకాలు ప్రదానం చేశారు. పరిశోధనా రంగంలో విశేష ప్రతిభ కనభరిచిన 14 మందికి డాక్టరేట్లు అందించారు. అలాగే మరో 436 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులు నాగానంద, డాక్టర్ మోహన్, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టరేట్లు పొందిన వారు వీరే...

సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవంలో పరిశోధనా రంగంలో ప్రతిభ చాటిన పలువురికి చాన్సలర్ చక్రవర్తి, ముఖ్య అతిథి సేతురామన్ పంచనాథన్ డాక్టరేట్లు ప్రదానం చేశారు. డాక్టరేట్లు పొందిన వారిలో డెన్నీ జార్జి, రోషన్ రాయ్, వి.సాయిరామ్, హిరాక్ దూషి, వి.భాస్కరన్, సీఆర్ సంతోష్, ద్వాలా లోకేశ్వరరావు, పోనపల్లి ప్రశాంతి ప్రభు, ఎంఎస్ సాయి వినోద్, ప్రజాల చేత్రి, పట్నాన దుర్గా ప్రసాద్, ఆకాంక్ష అగర్వాల్, సురేష్ కుమార్ దహాల్ ఉన్నారు.

నిబద్ధతే విజయానికి సోపానం..

నిబద్ధతే విజయానికి సోపానమని, విద్యార్థులంతా తాము ఎంచుకున్న రంగాల్లో క్రమశిక్షణతో ముందుకు సాగాలని యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ పిలుపునిచ్చారు. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి స్నాతకోత్సవ సందేశాన్నిచ్చారు. క్రమశిక్షణ, సేవానిరతి, మానవతా విలువలు కలగలిపి బోధించే సత్యసాయి విద్యాసంస్థల్లో చదువుకున్న వారంతా ఎంతో అదృష్టవంతులన్నారు. విద్యార్థులంతా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని సమాజంలో నెలకొన్న సవాళ్లను ఎదుర్కోవాలన్నారు. ప్రతి విద్యార్థీ సానుకూల దృక్పథంలో ముందుకు నడవాలన్నారు. ప్రతి అడుగూ సమాజహితం కోసం వేయాలని పిలుపునిచ్చారు.



బ్రాస్ బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థులు



బ్రాస్ బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థినులు




పట్టాలు పొందిన విద్యార్థులు



ఓ ముఖ్య అతిథిని సన్మానిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు

నేడు సత్యసాయి జయంతి



ప్రశాంతి నిలయం: ప్రేమ మూర్తిగా.. సేవా స్ఫూర్తిగా.. ఆధ్యాత్మిక చైతన్య దీప్తిగా భక్తుల మదిలో కొలువైన సత్యసాయి 99వ జయంతి వేడుకలకు ప్రశాంతి నిలయం ముస్తాబైంది. శనివారం సాయికుల్వంత్ సభా మందిరంలో అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. సత్యసాయి సమాధిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. సాయికుల్వంత్ సభా మందిరాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ విచ్చేస్తున్నారు.

జయంతి వేడుకలు ఇలా ...

సత్యసాయి 99వ జయంతి వేడుకలు సాయికుల్వంత్ సభా మందిరంలో శనివారం ఉదయం 8 గంటలకు వేదపఠనంతో ప్రారంభమవుతాయి. 8.20 గంటలకు సత్యసాయి విద్యార్థులు గురువందనం కార్యక్రమం ఉంటుంది. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద ట్రస్ట్ వార్షిక నివేదికను వెల్లడిస్తారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య ప్రసంగిస్తారు. ఆ తర్వాత ముఖ్య అతిథి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ దివ్యాంగుల సేవ కోసం చేపట్టిన సత్యసాయి దివ్యాంగజన్ పథకం ద్వారా వికలాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తారు. సత్యసాయి 'ప్రేమతరు' పేరుతో 10 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహణ ఉంటుంది.

సాయంత్రం స్వర్ణ రథోత్సవం

సాయంత్రం 5 గంటలకు ప్రశాంతి నిలయం పురవీధుల్లో సత్యసాయి బంగారు రథం ఊరేగింపు, సాయికుల్వంత్ సభా మందిరంలో జోలోత్సవం నిర్వహిస్తారు. అనంతరం లాల్ గుడి కృష్ణ, లాల్ గుడి విజయలక్ష్మి దంపతుల వయోలిన్ కచేరీ ఉంటుంది. ఆ తర్వాత మహా మంగళ హారతితో వేడుకలు ముగుస్తాయి.

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

సత్యసాయి 99వ జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం రాత్రి పుట్టపర్తి చేరుకున్నారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో ప్రశాంతి నిలయంలోని సాయి శ్రీనివాస అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్న ఘన స్వాగతం పలికారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- వైఎస్ జగన్‌పై అసభ్యకర పోస్టింగులు
- లోకేష్, అనిత, అయ్యన్న, అచ్చెన్నపై కేసు నమోదు చేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్



వైఎస్సార్‌సీపీ నాయకులు, లీగల్‌సెల్ సభ్యులతో కలిసి సీఐ శ్రీకాంత్‌యాదవ్‌కు ఫిర్యాదు చేస్తున్న అనంత వెంకట రామిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, లీగల్ సెల్ నాయకులు

అనంతపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం పక్కనపెట్టి రాష్ట్రంలో 'రెడ్‌బుక్' రాజ్యాంగం అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు విపరీతంగా పెడుతున్నారన్నారు. ఆ పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోకపోతే ప్రైవేట్ కేసులు వేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులపై వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లీగల్‌సెల్ సభ్యులతో కలిసి ఆయన శుక్రవారం అనంతపురం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నారా లోకేష్, వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడుకు చెందిన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాల నుంచి పెట్టిన పోస్టులను సీఐ శ్రీకాంత్ యాదవ్‌కు వివరించారు. ఈ ట్వీట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మీడియాతో అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ జగన్‌ను ఉద్దేశించి పెట్టిన పోస్టింగ్‌లు తమ మనోభావాలు గాయపరిచేలా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మంత్రులుగా ఉన్న నారా లోకేష్, అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. నారా లోకేష్ ఆఫీస్‌లోనే ఈ పోస్టింగులకు రూపకల్పన చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసిన పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతున్నారన్నారు. చట్టం అందరికీ సమానంగా అమలయ్యేలా చూడాలని కోరారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్‌పై అవమానకర రీతిలో పెడుతున్న పోస్టులను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసి, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, సోషల్ మీడియా కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌ను కించపరిచేలా ఐటీడీపీ సోషల్ మీడియా ఖాతా నుంచి అసభ్యకర పోస్టింగ్స్ పెడుతున్నా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

ఐటీడీపీపై చర్యలేవీ?

ఐటీడీపీ పేరుతో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నా ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అనంతపురం, వైఎస్సార్ రీజనల్ కోఆర్డినేటర్ లింగాల లోకేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జి.ఉమాపతి మండిపడ్డారు. పోస్టులేవీ పెట్టకపోయినా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. జగన్‌పై పెట్టిన అసభ్యకర పోస్టింగ్స్‌పై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కేసు నమోదు చేయని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాకే చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు పెన్నోబులేసు, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, గౌస్ బేగ్, ఏకేఎస్ ఫయాజ్, మారుతినాయుడు, సుభాష్, విద్యార్థి నాయకులు కైలాష్, విజయ్ రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ ఉమామహేశ్వరి, కార్పొరేటర్లు దేవి, సుమతి, కమల్ భూషణ్, శేఖర్‌బాబు, టీవీ చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, మునిశేఖర్, హసీనా, నరసింహులు, రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు జూటూరు సుధాకర్ రెడ్డి, వెంకట్రాముడు, శ్రీనివాస్‌రెడ్డి, రామకిషోర్‌రెడ్డి, గాని నాగన్న, తలారి రేవతి, నరసింహారెడ్డి, బాకే హబీబుల్లా పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖలో అవినీతి జబ్బు

- గందరగోళంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయ పనితీరు
- ఉన్నతాధికారి చుట్టూ వైఫైలా అవినీతి
- లంచాల కోసం అనధికారిక డిప్యుటేషన్లు వేశారని ఫిర్యాదులు
- కలకలం రేపుతున్న వాయిస్ రికార్డులు



వాయిస్ రికార్డుల హల్‌చల్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) కార్యాలయం పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి చుట్టూ అవినీతి ఆరోపణలు వైఫైలా అల్లుకుపోయాయి. అనధికారికంగా డిప్యుటేషన్లు వేసి లంచాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఆమె మెడకు చుట్టుకున్నాయి. తాను ఎలాంటి డిప్యుటేషన్లూ వేయలేదని చెబుతున్నా..కొంతమంది ఉద్యోగులు పని చేస్తున్న చోటు కాకుండా డిప్యుటేషన్ వేసిన చోట ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్) వేస్తుండటంతో అసలు విషయం బయటపడింది. దీనికి తోడు తాజాగా ఉరవకొండ మలేరియా సబ్‌యూనిట్ ఉద్యోగి కోదండరామిరెడ్డి ఫిర్యాదులు, వాయిస్ రికార్డులు పలువురికి ఉచ్చుబిగించాయి. సొంత శాఖలోని ఉద్యోగులే బహిరంగ విమర్శలు చేయడంతో ఆరోగ్యశాఖ పరువు బజారున పడినట్టయ్యింది.

లావాదేవీలకు మధ్యవర్తిగా ఏఓ

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అటెండర్ నుంచి అధికారి వరకూ ఏ చిన్న పనికి వెళ్లినా కాసులు పీక్కుతింటున్నారని పీహెచ్‌సీ ఉద్యోగులు వాపోతున్నారు. లావాదేవీల కోసం డీఎంహెచ్‌ఓకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) గిరిజా శంకర్ మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. తొలుత ఇక్కడ సెటిల్ అయితేనే ఫైలు అక్కడకు వెళ్తుంది. లేదంటే ఇక్కడే ఆగిపోతుంది. గతంలో పలు ప్రైవేటు క్లినిక్‌ల కేసులు గిరిజాశంకర్ వద్దే సెటిల్ చేసుకుని ఆ తర్వాత డీఎంహెచ్‌ఓకు పంపేవారు. ప్రైవేటు నర్సింగ్‌హోంలు, క్లినిక్‌ల అరాచకాలకు బలైన బాధితులకు న్యాయం జరిగేది కాదని, డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోనే సెటిల్ చేసుకుని తిరిగి వారికి వెంటనే అనుమతులు ఇచ్చేవారని ఓ అధికారి వాపోయారు.

ఉరవకొండలో పనిచేసే మలేరియా విభాగం ఉద్యోగి కోదండరామిరెడ్డి ఇటీవల డీఎంహెచ్‌ఓపై కలెక్టర్‌కు, ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదులు చేశారు. వాస్తవానికి కోదండరామిరెడ్డిపైనా అవినీతి ఆరోపణలున్నాయి. విధులకు సరిగా వెళ్లకపోవడం, అనధికారిక గైర్హాజరు వంటి వాటితో ఆయన్ను సర్వీసు నుంచి తొలగించే వరకూ వెళ్లింది. అలాంటి వ్యక్తి ఫిర్యాదులు చేయడం, పలువురితో మాట్లాడిన వాయిస్‌లు బయట పెట్టడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం అవినీతి బహిర్గతమైంది. దీంతో కోదండరామిరెడ్డిని మూడు రోజుల క్రితమే కడపలోని ప్రాంతీయ సంచాలకుల కార్యాలయానికి కలెక్టర్ సరెండర్ చేశారు.

డీసీహెచ్ఎస్ సంభాషణ కలకలం

వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ పాల్ రవికుమార్ వాయిస్ రికార్డు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కోదండరామిరెడ్డితో మాట్లాడిన వాయిస్ రికార్డు చక్కర్లు కొడుతోంది. ప్రజారోగ్యశాఖకు చెందిన కోదండరామి రెడ్డితో పాల్ రవికుమార్ మాట్లాడాల్సిన అవసరం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. వీరి సంభాషణ ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది. తాజా వాయిస్ రికార్డులతో పాల్ రవికుమార్ పీకల్లోతు ఊబిలో ఇరుక్కున్నట్టయింది. అసలే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యం పడకేసి కనీసం టీకాలకు దిక్కులేని పరిస్థితి ఉండగా.. ఇక్కడేమో కార్యాలయ అధికారులు అవినీతిలో మునిగి తేలుతున్నారు. మరోవైపు డీఎంహెచ్‌ఓ కార్యాలయ పనితీరుపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది.

క్లుప్తంగా

బనానా రైలు ప్రారంభం



అరటి ఎగుమతుల గూడ్స్ బండిని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ అంబికా

తాడిపత్రి రూరల్: అరటి ఎగుమతులకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రత్యేక గూడ్స్ రైలును (బనానా రైలు) తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు జెండా ఊపి రైలును ప్రారంభించారు. వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా వ్యవసాయ, మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, హార్టీకల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఏపీఈడీఏ జీఎం వినీత సుధాన్షు, కంటైనర్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ అనిత బారిక్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, శ్రీకృష్ణ ఇంపెక్స్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అనీష్ అగర్వాల్, ఆర్డీఓ కేశవనాయుడు, హార్టీకల్చర్ డీడీ నరసింహారావు, ఎపీఎంఐపీ డీడీ రఘునాథరెడ్డి, ఏడీ ఫిరోజ్‌ఖాన్, రైల్వే స్టేషన్ మాస్టర్ అనిల్‌కుమార్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అనూప్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

హెచ్‌ఎంపై ఉపాధ్యాయురాలి దాడి



బాధిత హెచ్‌ఎంను విచారిస్తున్న ఎంఈఓ మనోహర్

గుత్తి: స్థానిక అనంతపురం రోడ్డులో ఉన్న ఉర్దూ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. చిన్నపాటి విషయాన్ని తీవ్ర ఆవేశానికి లోనైన టీచర్ బల్కిస్ సుల్తానా... హెచ్‌ఎం నూరున్నీషాపై దాడి చేసింది. వివరాలు... విద్యార్థులకు హెచ్‌ఎం నూరున్నీషా పాఠాలు చెబుతున్న సమయంలో అక్కడికి టీచర్ బల్కిస్ సుల్తానా వెళ్లింది. నా తరగతి గదికి వచ్చి పాఠాలు చెప్పడానికి నువ్వు ఎవరంటూ గద్దించింది. ఏ తరగతి గదికైనా వెళ్లి పాఠాలు బోధించే హక్కు హెచ్‌ఎంకు ఉందని నూరున్నీషా తెలపడంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ క్రమంలో విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లేందుకు హెచ్‌ఎం ఫోన్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ఆ సెల్‌ఫోన్‌ను బల్కిస్ సల్తానా లాక్కొని బండకేసి కొట్టింది. అంతటితో ఆగకుండా హెచ్‌ఎంపై దాడి చేసి కొట్టింది. ఘటనలో హెచ్‌ఎం చీర చిరిగింది. విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి పోలీసులకు, ఎంఈఓలు రవి నాయక్, మనోహర్‌కు బాధిత హెచ్‌ఎం ఫిర్యాదు చేయడంతో ఎంఈఓ–2 మనోహర్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. విచారణ నివేదికను డీఈఓకు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



పాములాయి వద్ద నేలవాలిన వరి పంట

వరి... మిగిల్చింది వర్రీ

వరి పంట చేతికొస్తే కష్టాలు గట్టెక్కుతాయన్న రైతన్నల ఆశలపై అకాల వర్షాలు నీళ్లు చల్లాయి. ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలతో వరిలో దిగుబడి గణనీయంగా తగ్గింది. కోతకు వచ్చిన వరి పంట గాలుల ఉధృతికి ఎక్కడికక్కడ తలవాల్చడంతో వడ్లు రాలిపోయాయి. దీంతో రైతులు యంత్రాలను ఏర్పాటు చేసి పంట కోతలు చేపట్టారు. చేతికి వచ్చిన అరకొర ధాన్యాన్నే రహదారిపై ఆరబోశారు. అకాల వర్షాలు రాకుంటే ఆశించిన మేర పంట చేతికొచ్చి కష్టాలు గట్టెక్కేవని పాములాయికి చెందిన రైతు ఆదినారాయణ తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం







ఇటీవల పెనుగాలులతో కూడిన వర్షానికి నేలకు అతుక్కుపోయిన వరి పంట, హార్వెస్టర్ సాయంతో చేపట్టిన వరి కోతలు

జంతలూరు వద్ద రహదారిపై ఆరబోస్తున్న వరిధాన్యం

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా

- చెక్‌డ్యామ్‌లో నీట మునిగి విద్యార్థి మృతి



చరణ్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణాలు బలిగొంది. వివరాలు... గుంతకల్లు మండలం నెలగొండ గ్రామానికి చెందిన గోవిందు, శకుంతల దంపతులకు కుమారుడు చరణ్ (14), ఓ కుమార్తె ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న చరణ్... శుక్రవారం తన స్నేహితులు ఈతకు వెళుతున్నారన్న విషయం తెలుసుకుని బడి ఎగ్గొట్టి వారితో పాటు సైకిల్‌పై గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. ఈత కొట్టేందుకు సిద్ధమవుతుండగా అక్కడే ఉన్న సమీప బంధువులైన గొర్రెల కాపరులు వారించారు. అయినా తనకు ఈత వస్తుందని బుకాయించాడు. వద్దని వాళ్లు గట్టిగా చెప్పడంతో చేసేదేమీ లేక చెక్‌డ్యాం వద్ద కూర్చొని కాళ్లు నీళ్లలో పెట్టి ఆడుకుంటూ కూర్చొన్నాడు. ఈ క్రమంలో బంధువుల దృష్టి ఏమార్చి నీళ్లలోకి దిగిన చరణ్ కాసేపు ఈత కొడుతూ లోతైన ప్రాంతానికి వెళ్లి నీట మునిగాడు. మిగిలిన పిల్లలు కేకలు వేయడంతో గొర్రెల కాపరులు నీటిలో దిగి గాలింపు చేపట్టినా చరణ్ జాడను పసిగట్టలేకపోయారు. దీంతో చుట్టుపక్కల పొలాల్లో పనుల్లో నిమగ్నమైన రైతుల సాయం తీసుకుని మరోసారి చెక్‌డ్యాంలోకి దిగి దాదాపు గంటన్నర సేపు గాలించిన అనంతరం చరణ్ మృతదేహాన్ని వెలికి తీశారు. అప్పటికే విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు భారీగా అక్కడకు చేరుకున్నారు. చరణ్ ప్రాణాలతో ఉన్నాడనే అనుమానంతో కుటుంబసభ్యులు గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మృత్యువులోనూ వీడని బంధం



మృతుడు గంగన్న



మృతి చెందిన నరసమ్మ

- రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతుల మృతి

ముదిగుబ్బ: పెళ్లిలో ఏడడుగులు వేసినప్పటి నుంచి ఒకరికొకరు తోడుగా ఉంటూ బతుకు బండిని లాగుతూ వచ్చారు. రక్తసంబంధీకులు ఉన్నా ఒకరిపై ఆధారపడకుండా సొంత కష్టంతోనే జీవనం సాగిస్తున్నారు. అలా సాగిపోతున్న వారి దాంపత్య జీవితం మలిదశలో మృత్యువు తొంగిచూసింది. గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరూ దుర్మరణం పాలయ్యారు. వివరాలు... ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లికి చెందిన గంగన్న (80), నరసమ్మ (74) దంపతులు శుక్రవారం రాత్రి ముదిగుబ్బ నుంచి స్వగ్రామానికి ఆటోలో చేరుకున్నారు. రోడ్డుకు అటు వైపు దిగిన వారు గ్రామంలోకి వెళ్లేందుకు రహదారిని దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. కాగా, వృద్ధ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పట్నం ఎస్‌ఐ రాజశేఖర్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పంట నష్టం అంచనాలు పూర్తి

- ఈ నెల 25 వరకు ఆర్‌ఎస్‌కేలో సోషల్ ఆడిట్



అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కరువు జాబితాలో ప్రకటించిన మండలాల్లో పంట నష్టం అంచనాలు పూర్తయినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. అనంతపురం జిల్లాలో ఏడు మండలాలు (అనంతపురం, నార్పల, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు) శ్రీసత్యసాయి జిల్లాలో పది మండలాల (తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, కనగానపల్లి, ధర్మవరం, ఎన్పీ కుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి)ను కరువు జాబితాలో ఉన్నాయి. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్డీఆర్‌ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్డీఆర్‌ఎఫ్) నిబంధనల మేరకు ఈ నెల 14 నుంచి పంట నష్టం అంచనాలు తయారు చేశారు. సామాజిక తనిఖీ నిమిత్తం కరువు మండలాల ఆర్‌ఎస్‌కే(రైతు సేవా కేంద్రా)ల్లో జాబితాలు అందుబాటులో పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఏదైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 25లోపు సవరించుకునేందుకు అవకాశం కల్పించారు. కరువు నివేదికకు సంబంధించి ఈ నెల 28న తుది ముసాయిదా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపనున్నారు. మొత్తం మీద ఉమ్మడి జిల్లాలో కరువు జాబితాలో 17 మండలాలు ఉండగా.. ఆయా మండలాల్లో ఒక్కో రైతుకు గరిష్ఠంగా రెండు హెక్టార్లను పరిగణనలోకి తీసుకుని అంతో ఇంతో ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో పరిహారం ఇవ్వనున్నారు. కరువు జాబితాలో లేని మిగతా 46 మండలాల్లో ఉన్న లక్షలాది మంది రైతులకు పైసా ఇవ్వకుండా రిక్తహస్తం చూపించనున్నారు.

అప్పులు తీర్చే మార్గం కానరాక రైతు ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

ఉరవకొండ: అప్పులు తీర్చే మార్గం కానరాక ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ (51) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకున్న 8 ఎకరాల పొలంలో గత రెండేళ్లుగా మిరప, వేరుశనగ, పప్పుశనగ తదితర పంటలను రైతు వెంకటేష్ సాగు చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో పంటల సాగుకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టాలు చవిచూడడంతో అప్పులు తీర్చలేకపోయాడు. దీంతో ఎలాగైనా రుణ విముక్తి పొందాలనుకున్న ఆయన... మరి కొంత అప్పు చేసి గొర్రెల పోషణ చేపట్టాడు. అయితే అనారోగ్యం కారణంగా 20 గొర్రెలు మృతి చెందాయి. పంటల సాగు, గొర్రెల పోషణకు చేసిన అప్పులు రూ.10 లక్షలకు చేరుకోవడంతో వాటిని ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ కుటుంబసభ్యులతో చెప్పుకుని గురువారం బాధపడ్డాడు. అనంతరం అదే రోజు రాత్రి పొలం వద్ద ఉన్న జీవాల దొడ్డిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భోజనం తీసుకుని వెళ్లిన కుటుంబ సభ్యులు గమనించి వెంటనే వెంకటేష్‌ను ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, వెంకటేష్‌కు భార్య గంగమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చలిగింతలు మొదలు

- రెండు రోజులుగా పెరిగిన చలితీవ్రత



అనంతపురం అగ్రికల్చర్: చలిగింతలు మొదలయ్యాయి. వేకువజామున పొగమంచు అధికమైంది. గత రెండు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. డిసెంబర్, జనవరిలో చలి తీవ్రత మరింత పెరిగే సూచనలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నెల రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల నుంచి 35 డిగ్రీల మధ్య స్థిరంగా నమోదవుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా 19 నుంచి 22 డిగ్రీల మధ్య కొనసాగాయి. అయితే రెండు రోజులుగా పగలు స్థిరంగా ఉండగా రాత్రిళ్లు రెండు మూడు డిగ్రీలు తగ్గుముఖం పట్టడం విశేషం. బుధవారం కనిష్ట ఉష్ణోగ్రత ఒక్కసారిగా 15.9 డిగ్రీలు నమోదైంది. గుత్తి, ఉరవకొండ, కూడేరు, కణేకల్లు, డి.హీరేహాళ్, పెద్దవడుగూరు, వజ్రకరూరు, రాయదుర్గం, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు తదితర మండలాల్లో 15 నుంచి 17 డిగ్రీల మధ్య కనిష్ఠం నమోదు కాగా మిగతా ప్రాంతాల్లో 20 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. పగలు మాత్రం 30 డిగ్రీల నుంచి 34 డిగ్రీల మధ్య రికార్డవుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు, కూలీలు, కూరగాయలు, పాల వ్యాపారులు, వృద్ధులు, చిన్నారులు, రోగులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఉంటుంది. టోపీలు, మాస్కులు, గ్లౌస్‌లు, సాక్సులు, స్వెట్టర్లు వాడాలి.

గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా

తేదీ	గరిష్టం (డిగ్రీలు)	కనిష్టం (డిగ్రీలు)
15	32.5	21.1
16	32.7	21.6
17	32.2	20.4
18	34.4	19.1
19	35.2	19.4
20	34.2	15.9
21	33.5	15.1

మెగా సప్లి హాల్‌టికెట్లు అందుబాటులోకి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు ఈ నెల 23 నుంచి జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ మూడు, ఐదు, ఏడు సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. మెగా సప్లిమెంటరీకి సంబంధించి మూడు, ఐదు సెమిస్టర్ అభ్యర్థులకు రెగ్యులర్ వారితో పాటు పరీక్షలు నిర్వహించనున్నారు.

'సాగునీటి' ఎన్నికల షెడ్యూల్ ఖరారు

అనంతపురం సెంట్రల్: సాగునీటి సంఘాల ఎన్నికలకు నగారా మోగింది. డిసెంబర్ 5న నోటిఫికేషన్ వెలువడనుంది. 8న నీటి సంఘాలకు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో మొత్తం 164 సంఘాలు ఉన్నాయి. ఇందులో 12 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 3 ప్రాజెక్టు కమిటీలు, 149 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటన్నింటికీ త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం.. విద్యార్థి దుర్మరణం



అఖిల్ (ఫైల్)

పెనుకొండ: ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం ఓ విద్యార్థి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామానికి చెందిన వడ్డె నాగరాజు కుమారుడు అఖిల్ (13) పెనుకొండలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రోజూ సైకిల్‌పై స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్కూల్‌కు సైకిల్‌పై బయలుదేరిన అఖిల్ గ్రామ శివారులోని చెరువు కట్ట వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్‌కు దారి వదిలేందుకు రోడ్డు పక్కన ఆపిన ఘనగిరి పాఠశాల బస్సు వెనుక నిలబడ్డాడు. ట్రాక్టర్ వెళ్లడానికి దారి లేక పోవడంతో బస్సు డ్రైవర్ ఉన్నఫళంగా తన వాహనాన్ని వేగంగా రివర్స్ చేశాడు. సైకిల్‌పై నిల్చొన్న అఖిల్ ప్రమాదాన్ని గుర్తించేలోపు బస్సు వెనుక చక్రాల కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడున్న గ్రామస్తులు వెంటనే బాలుడిని పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అఖిల్ మృతి చెందినట్లు నిర్ధారించడంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది. ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమంటూ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో ఎస్‌ఐ వెంకటేశ్వరు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి



మృతురాలు సునీత

పెద్దపప్పూరు: మండలంలోని సింగనగుట్టపల్లికి చెందిన వివాహిత సునీత (30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గుంతకల్లు మండలం ఇమాంపురం గ్రామానికి చెందిన సునీతకు 12 ఏళ్ల క్రితం సింగనుగుట్టపల్లి నివాసి శంకరయ్యతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం రాత్రి నుంచి ఆమె కనిపించకుండా పోయింది. శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని పొలాల్లో ఆమె మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పక్కనే పురుగుల మందు డబ్బా ఉంది. ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ అన్న నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఓటు నమోదుకు నేడు, రేపు ప్రత్యేక క్యాంపులు

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణలో భాగంగా ఓటు నమోదుకు ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ప్రచార క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ రెండు రోజులూ బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి వయసు 18 ఏళ్లు నిండిన లేదా నిండనున్న వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 28 వరకు అవకాశం ఉందన్నారు. ప్రత్యేక ప్రచార క్యాంపుల్లోనూ ఓటరు నమోదు, ఓటు వివరాల మార్పునకు, ఓటు తొలగింపునకు దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తును ఆఫ్‌లైన్ ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు సమర్పించవచ్చని సూచించారు. అదేవిధంగా బూత్‌స్థాయి అధికారులకు కూడా ఇవ్వవచ్చని తెలిపారు. www.nvrp.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్ ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి మరింత సమాచారం, సహాయం కోసం కలెక్టరేట్‌లోని టోల్ ఫ్రీ నంబరు 1950ను సంప్రదించవచ్చని తెలిపారు.

నేటి నుంచి కొనకొండ్లలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

వజ్రకరూరు: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలకు వజ్రకరూరులోని జెడ్పీహెచ్‌ఎస్ సిద్ధమైంది. ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు శుక్రవారం ఆ పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్, పీఈటీలు సత్యనారాయణ, కళాసుధాకర్ వెల్లడించారు.

వైభవంగా హొన్నూర్ షంషేర్ వేడుక

బొమ్మనహాళ్: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూర్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సర్మస్ హుస్సేనీ స్వామి షంషేర్, దేవుడి సవారీ కార్యక్రమాలు ఘనంగా సాగాయి. తెల్లవారుజామున దేవుడి సవారీ, షంషేర్‌ను ఊరేగింపుగా తీసుకువచ్చారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో దర్గాహొన్నూర్ గ్రామం జనసంద్రమైంది. స్వామి సమాధిని దర్శించుకుని పూలమాలలు సమర్పించి, చక్కెర చదివింపులతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దర్గా పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి



షంషేర్ ఊరేగింపు దృశ్యం



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ లోగో ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: క్రీడలతో శారీక, మానసికోల్లాసం కలుగుతుందని డీఆర్‌ఓ ఎ.మలోల అన్నారు. ఎప్పుడూ పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి రెండు నెలల పాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ లోగో ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో ఆర్డీటీ చేస్తున్న సేవలు, క్రీడాభివృద్ధి చేస్తున్న కృషిని వెలకట్టలేమన్నారు. ఉద్యోగులందరూ క్రీడా స్ఫూర్తితో ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సంఘం అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులందరినీ ఒక వేదిక మీదకు తీసుకొచ్చి క్రికెట్ స్ఫూర్తిని నింపాలనే లక్ష్యంతో ఈ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నీలో 20 జట్లు పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు విజయరాజు, సతీష్, మారుతి, శ్రీకాంత్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నిస్సాన్ షోరూం ప్రారంభం



న్యూ మ్యాగ్నెట్ కారును ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అనంతపురం సెంట్రల్: నగరంలో రుద్రంపేట బైపాస్ రోడ్డులో నిస్సాన్ షోరూంను శుక్రవారం ప్రారంభించారు. న్యూ మ్యాగ్నెట్ కారును ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ నర్సింహం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు ఎయిర్ బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ, హిల్‌స్టార్ట్, అసిస్ట్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ వ్యవస్థ లాటి అనేక ఫీచర్‌లతో ఈ వాహనం తయారు చేసినట్లు వివరించారు. కస్టమర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథ రెడ్డి, డైరెక్టర్ నిరంజన్, జనరల్ మేనేజర్ శాస్త్రీ, సేల్స్ మేనేజర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: ఫార్మా కంపెనీలు కార్మిక చట్టాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని మెడికల్ రిప్రజెంటేటివ్స్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ జాతీయ నాయకులు మనోహర్, చంద్రశేఖర్, రాష్ట్ర నాయకుడు ఇషాక్, జిల్లా కార్యదర్శి మంజునాథ్ మాట్లాడారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌లను హై స్కిల్డ్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మెడికల్ రెప్స్‌కు సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయ్ చట్టం అమలు చేయాలని కోరారు. కార్మిక చట్టానికి విరుద్ధంగా రెప్‌లను ఇబ్బంది పెట్టే ఫార్మా కంపెనీల యాజమాన్యాలను శిక్షించాలన్నారు. అనంతరం కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రిప్రజెంటేటివ్‌లు బాలకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా పూల నాగరాజు



అనంతపురం క్రైం: ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా పూల నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఆర్టీసీ కడప జోన్‌ను అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ పలువురు పూల నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

కచ్చా రోడ్ల ఏర్పాటుకు చర్యలు

అనంతపురం కార్పొరేషన్: వివాదాస్పద సెంట్రల్ పార్క్‌లో స్థలంలో కచ్చా రోడ్ల ఏర్పాటుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. శుక్రవారం కమిషనర్ నాగరాజు ఆదేశాలతో ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి, టీపీఓ శిరీష, టీపీఎస్ మంజులమ్మ, మండల సర్వేయర్ రఘు సెంట్రల్ పార్క్‌లో పర్యటించారు. రోవర్ సహాయంతో కచ్చా రోడ్లకు మార్క్ వేశారు. అక్కడ రెండు ప్రాంతాల్లో రోడ్లు తీస్తుండగా స్థానికంగా ఉండే కొందరు తమ స్థలంలో రోడ్లు ఏ విధంగా తీస్తారంటూ అభ్యంతరం తెలిపారు. అందుకు ఏసీపీ నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో తాము మార్కింగ్ వేస్తున్నట్లు తెలిపారు. ఏసీపీ వెంట నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ఉపాధి హామీ పనులపై గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఏపీఓ సుజాత మాట్లాడుతూ.. జాబ్‌కార్డు ఉండి ఆ కార్డులో వ్యక్తులు మరణించినా.. లేదా ఆ వ్యక్తులు గ్రామంలో లేకపోయినా, ఉపాధి పనికి వెళ్లడానికి ఆసక్తి లేని వారిని గుర్తించాలని తెలిపారు. ఉపాధి పనులు, జాబ్‌కార్డుల కోసం ఉపాధిహామీ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

భవనాలున్నా నిరుపయోగం



పాత ఎంపీడీఓ కార్యాలయం



పాలశీతలీకరణ కేంద్రం

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్న ప్రభుత్వ కార్యాలయ పాత భవనాలు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా
- వినియోగంలోకి తీసుకుని రావాలని కోరుతున్న స్థానికులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పాలడెయిరీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయాలతో పాటు ఎంపీపీ క్యాంప్ కార్యాలయం నిరుపయోగంగా ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం ఈ కార్యాలయాల్లో కార్యకలాపాలు జరిగాయి. అయితే ఈ భవనాలు పాతబడ్డాయనే కారణంతో కొత్త భవనాలను మంజూరు చేశారు. వీటిని ఖాళీ చేయడంతో పాటు వాటి నిర్వహణను గాలికొదిలేశారు. భవనాలను వినియోగించక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కాగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాత పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం కూలిపోయింది. ఈ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఓ వైపున ఉన్న గోడ పూర్తిగా ధ్వంసమైంది. అలాగే పాలశీతలీకరణ కేంద్రం (పాల డెయిరీ) భవనం వృథాగా ఉండటంతో డోర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ భవనం బిచ్చగాళ్లకు నిలయంగా మారింది. భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భవనాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. భవనాలకు మరమ్మతులు చేయించి ఇతర ప్రభుత్వ సేవలకు వినియోగించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

మరమ్మతులు చేస్తే మేలు

మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాత భవనాలకు మరమ్మతులు చేస్తే వాటిని ఉపయోగించుకోవచ్చు. వాటిని అలాగే వదిలేస్తే కూలిపోయే ప్రమాదం ఉంది. దీంతో కోట్లాది రూపాయలు ప్రజాధనం వృథా అవుతోంది. అధికారులు వెంటనే భవనాలను పరిశీలించాలి. వీటిని ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించుకోవాలి.

– లింగన్న, చెన్నేకొత్తపల్లి



కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

అనంతపురం కార్పొరేషన్: కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం డిప్యూటీ మేయర్ కోగటం చాంబర్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూ.38 లక్షల వ్యయంతో వీల్ బారెర్స్, పుష్‌కాట్స్ మొత్తం 330, రూ.28 లక్షలతో కన్స్యూమబుల్స్, తదితర వాటికి టెండర్లను ఆహ్వానించినట్లు వెల్లడించారు. త్వరలో వీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజారోగ్యం కాపాడటంలో కార్మికులది కీలకపాత్ర అని కొనియాడారు. అదేవిధంగా మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



కార్మికులతో సమావేశమైన డిప్యూటీ మేయర్ కోగటం, కమిషనర్ నాగరాజు

కళలను ప్రోత్సహించాలి

అనంతపురం కల్చరల్: సహజంగా చిన్నారుల్లో ఉండే కళలు, సృజనను తెలుసుకుని ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా పర్యాటక, పురావస్తు శాఖలతో కలిసి ఇంటాక్ (భారతీయ కళలు, వారసత్వ పరిరక్షణ సంస్థ) ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా పురావస్తు శాఖ ఏడీ రజిత, న్యాయనిర్ణేతగా వ్యవహరించిన సీనియర్ చిత్రకారుడు ఎల్‌ఆర్ వెంకట రమణ, ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఏజీ వేణుగోపాలరెడ్డి తదితరులు మాట్లాడారు. శతాబ్దాలుగా పెద్దలు మనకందించిన వారసత్వ సంపద, కళలను కాపాడుకోవడానికి ఇంటాక్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, రియాజుద్దీన్, నబీరసూల్, సూర్యనారాయణరెడ్డి, సామాజిక సేవాకార్యకర్త అనిల్‌కుమార్‌రెడ్డి, మాసుం బాబా తదితరులు పాల్గొన్నారు.



చిత్రకారుడు వెంకటరమణను అభినందిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

సంక్షిప్త సమాచారం

ఘనంగా సత్యసాయి జయంతి

అనంతపురం కల్చరల్: నిరంతర సేవా స్ఫూర్తి సత్యసాయిబాబా అని వలీస్వామి ఆశ్రమ నిర్వాహకుడు విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని శ్రీసద్గురు వలీస్వామి ఆశ్రమంలో శుక్రవారం సత్యసాయి 99వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆశ్రమ ప్రతినిధి విజయ్‌కుమార్ నేతృత్వంలో వివిధ సంస్థల నుంచి విచ్చేసిన భక్తులు భజన చేశారు. మందిరంలో కొలువైన కొల్హాపూర్ మహాలక్ష్మికి, సత్యసాయి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలోని ఉసిరిచెట్టు కింద కార్తీక వనభోజనాలు నిర్వహించారు.

రేపు 'ఎన్టీఆర్ చలనచిత్ర స్వరనీరాజనం'

అనంతపురం కల్చరల్: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చలన చిత్రరంగంలో ప్రవేశించి 75 ఏళ్లు దాటిన సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా కళాకారులు ఈనెల 24న ఎన్టీఆర్ చలన చిత్ర స్వరనీరాజనం పేరుతో సంబరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బాలమురళీ, ఆచార్య సుధాకర బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక లలిత కళాపరిషత్తు వేదికగా జరిగే కార్యక్రమంలో ఎన్టీఆర్ నటించిన సినిమాల్లోని గీతాలను గాయకులు ఆలపిస్తారన్నారు.

స్థల పరిశీలన

ఆత్మకూరు: మండలంలో లో ఓల్టేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ రంగస్వామి, ఈఈ మనోరమ తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం మండల ఏఈ దాసుతో కలిసి మండలంలోని గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాల్లో పర్యటించారు. సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చేసేందుకు నూతన సబ్‌స్టేషన్లను త్వరలోనే నిర్మిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శశాంక్, కన్వీనర్ శీన తదితరులు పాల్గొన్నారు.

బట్ట సంచుల పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని కమిషనర్ నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరపాలక సంస్థలో గ్రీన్ ఆర్మీ వారు సమకూర్చిన బట్ట సంచులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. గ్రీన్ ఆర్మీ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. రూ.10 లక్షల వ్యయంతో బట్ట సంచులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి విడతలో 10 వేల సంచులను చిరు వ్యాపారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు బట్ట సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ అనిల్ కుమార్, కార్పొరేటర్ అబూసలేహ తదితరులు పాల్గొన్నారు.

అనంతకు చేరుకున్న పాద యాత్రికులు

అనంతపురం కల్చరల్: శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన హైదరాబాద్‌కు చెందిన సుమారు 55 మంది అయ్యప్ప స్వాములు శుక్రవారం అనంతకు చేరుకున్నారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో సోములదొడ్డి గ్రామం వద్ద వారికి స్వాగతం పలికారు. అయ్యప్పలకు వసతి, భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం తపోవనంలోని చిన్మయా జగదీశ్వరాలయంలో సామూహిక భజన చేశారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి, గురుస్వామి వేణుగోపాల్, కిషోర్‌గౌడ్ గురుస్వామి, ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఆలయ ప్రతినిధి రఘుస్వామి, ట్రస్టు సభ్యులు నారాయణనాయక్, రాఘవేంద్ర, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ నమోదు

రాప్తాడు: ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి రమేష్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయకుమారి ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. బీఎల్వోలు, సూపర్‌వైజర్లు గైర్హాజరైనట్లు తెలిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈడీటీ సువర్ణ, ఆర్‌ఐ రాగే కరుణాకర్, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలి అదృశ్యం

అనంతపురం: గుత్తి రోడ్డులో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న ఓ మహిళ అదృశ్యమైనట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. ఎల్‌బీ నగర్‌లో నివాసం ఉంటున్న ఎస్.చిన్ని కృష్ణ భార్య అనిత (25) బ్యూటీ పార్లర్ నిర్వహణకు రూ.5 లక్షలు అప్పు చేశారు. అప్పులు తీర్చడంలో విఫలం కావడంతో మనస్తాపం చెందారు. శుక్రవారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో భర్త చిన్నికృష్ణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మొక్కలపై అవగాహన తప్పనిసరి



పంపనూరు పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు: జిల్లా కేంద్రానికి చెందిన శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల విద్యార్థులు శుక్రవారం పంపనూరు సిటీ పార్కును సందర్శించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కళాశాలకు చెందిన సహాయ ఆచార్యులు డాక్టర్ జీవన్, డాక్టర్ పవిత్ర డాక్టర్ నాగిరెడ్డి, పవిత్ర తదితరులు మొక్కలపై అవగాహన కల్పించారు. హార్టికల్చర్ కోర్సులో ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్ సబ్జెక్టు ఉండటం వల్ల హార్టికల్చర్ విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని అధ్యాపకులు తెలిపారు. అనంతరం పార్కులో అనేక రకాల మొక్కలతో పాటు అలంకరణ మొక్కలు, వృక్షాలతో రూపొందించిన గార్డెన్‌ను పరిశీలించారు.

బాలసదనంలో వైద్య శిబిరం

అనంతపురం సెంట్రల్: మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా శుక్రవారం బుడ్డప్ప నగర్‌లోని బాలసదనం, శిశుగృహాలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీడియాట్రిషన్ డాక్టర్ శ్రీ విద్య, మెడికల్ ఆఫీసర్ జగదీష్ నాయక్, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ రజిత, డెంటిస్ట్ ముత్యాలమ్మ తదితరులు వైద్య పరీక్షలు చేశారు. 14 మందికి దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



క్రీడల్లో సత్తా చాటిన మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల విద్యార్థులు

రాప్తాడు: గొల్లపల్లి సమీపంలోని మాంటిస్సోరి ఎలీట్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడల్లో సత్తా చాటారు. వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ అండర్-17, 14, 19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గోవర్ధన్ నాయక్, మంజునాథ్, గౌతమ్ కుమార్ రెడ్డి, యామిని రెడ్డి, హర్షవర్ధన్, లోకనాథ్ రెడ్డి, సాయి సమ్రిత్, భానుప్రసాద్, శివ చరణ్, వైష్ణవి, ప్రవీణ్ చంద్ర అంజిర్, సాయి చరణ్, మణికంఠ రెడ్డి, దినేష్, యేగేశ్వర నాయుడు, ప్రవీణ్ కుమార్, నరసింహ నాయుడు, జ్ఞానవర్ధన్, శ్రీహస్త, స్వాతి, గురువర్షిణి, రక్షిత, సాయి దీక్షిత జిల్లా స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ఎండీ క్రిష్ణ భరత్, కరస్పాండెంట్ సమీరా, ప్రిన్సిపాల్ మధు, హెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

'ఆధార్' అవస్థలు



హెడ్ పోస్టాఫీసు వద్ద పడిగాపులు కాస్తున్న జనం

అనంతపురం సిటీ: ఆధార్‌లో మార్పులు, చేర్పులతో పాటు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఇండియా) లింకేజీ కోసం వచ్చే వారితో అనంతపురం హెడ్ పోస్టాఫీసు పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వం విద్యార్థుల కోసం అపార్ విధానాన్ని అమలు చేస్తోంది. దీనికి అవసరమైన ఆధార్‌లో పుట్టిన తేదీ తప్పుగా ఉంటే వాటిని సరి చేసుకునేందుకు అవకాశం కల్పించింది. తోడు అమ్మ ఒడి వంటి ప్రభుత్వ పథకాలు అందుకోవాలంటే కచ్చితంగా బ్యాంక్ లేదా పోస్టల్ ఖాతాతో లింక్ అయి ఉండాలి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెల్లవారుజామున 5 నుంచే హెడ్ పోస్టాఫీసుకు క్యూ కడుతున్నారు. హెడ్ పోస్ట్‌మాస్టర్ జి.భానుకుమార్ చొరవ తీసుకొని ఇది వరకే ఉన్న కౌంటర్ సహా అదనంగా మరో కౌంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. బయట నెట్ సెంటర్లలో ఇవన్నీ చేయించాలంటే వందలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. అదే పోస్టాఫీసులో అయితే కేవలం రూ.200కే ఇవన్నీ చేస్తున్నారు. మిగిలిన పోస్టాఫీసుల్లోనూ ఆధార్ అప్‌డేషన్స్, ఎన్‌పీసీఐ లింకేజీకి అవకాశం కల్పిస్తే హెడ్ పోస్టాఫీసుపై ఒత్తిడి తగ్గుతుంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళా సాధికారత



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళా సాధికారత సాధ్యమైందని మేయర్ వసీం తెలిపారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని భావించిన అప్పటి సీఎం జగన్ ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వాములను చేశారని కొనియాడారు. శుక్రవారం ఇరాన్‌లోని కొర్రమాబాద్‌లో జరుగుతున్న ఆసియా మేయర్ల అంతర్జాతీయ సదస్సుల్లో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై మేయర్ మాట్లాడారు. మొదటగా తనకు మేయర్‌గా అవకాశం ఇచ్చిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలు అన్ని విధాల అభివద్ధి చెందేలా రాజకీయంగా, చట్టసభల్లోనూ అవకాశం కల్పించారన్నారు. ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వాములను చేయడం జరిగిందన్నారు. సేవా కార్యక్రమాలు, ఉద్యోగాలు ఇలా.. అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా ముందుకెళ్తున్నారని గుర్తు చేశారు. నాలుగు నెలల క్రితం రష్యాలో జరిగిన బ్రిక్స్ మేయర్ల సదస్సులో పాల్గొనడం జరిగిందన్నారు. ఇప్పుడు ఇరాన్‌లో వివిధ దేశాలకు చెందిన మేయర్లు, రాయబార్లు, హై కమిషనర్లు, అంబాసిడర్ల మధ్య ఆంధ్రప్రదేశ్ నుంచి తనకు అవకావం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రీలంక, రష్యా, టర్కీ, ఆఫ్ఘనిస్తాన్, నుంచి వచ్చిన ప్రతినిధులతో కలవడం ద్వారా కొత్త విషయాలపై అవగాహన వచ్చిందన్నారు. అనంతరం అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్ పార్క్‌లో భారతదేశం తరఫున మొక్క నాటారు.

అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం అర్బన్: విద్యుత్ ఉద్యోగుల కళాభారతిలో 12 ఏళ్లగా జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఐక్య కార్మిక, రైతు ఉద్యమంలో భాగంగా ఈనెల 26న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ అధ్యక్షతన ఆఫీసు బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల కళాభారతిలో దాదాపు 12 ఏళ్ల నుంచి రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. బహిరంగ టెండర్ల ద్వారా డిపాజిట్ అవుతున్న దాదాపు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు ఎక్కడున్నాయనేది తెలియక ఉద్యోగులు ఆయోమయంలో ఉన్నారు. ఇక్కడి అవినీతి, అక్రమాలపై అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కళాభారతిని కాపాడేందుకు పెద్ద ఎత్తున్న కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు కావడం లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణుడు, నాగవేణి, శ్రీనివాసులు, చిరంజీవి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి పీఎస్‌ఎఫ్‌ఐ మహాసభలు



లోగో విడుదల చేస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రొగ్రెస్సివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (పీఎస్ఎఫ్ఐ) రాష్ట్ర మహాసభలు డిసెంబరు 9 నుంచి 11 వరకు అనంతపురంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన లోగోను శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ పద్మశ్రీ విడుదల చేశారు. ఈ సందర్భంగా పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఆలం మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛ, శాంతి, పురోగతి లక్ష్యాలతో, 'చదువుతూ పోరాడు-చదువుకై పోరాడు' అనే నినాదంతో సంఘం పని చేస్తోందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్య నందించాలనే లక్ష్యంతో పోరాటాలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతిభభారతి, మౌనిక, అనిల్, కరుణాకర్, సుచిత్ర, వసంత, దతీష్, గణేష్ పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్ అధికంగా వాడొద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: మోతాదుకు మించి యాంటీ బయాటిక్స్ వాడరాదు. అతిగా యాంటీ బయాటిక్స్ వాడితే దుష్ఫలితాలు ఎదురవుతాయని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఔషధ నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా నగరంలో చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ వైద్య కళాశాల నుంచి ప్రభుత్వ సర్వజనాస్పత్రి వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. వైద్యుల సలహా మేరకు మందులు వాడితే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. అనంతరం వైద్య కళాశాలలో మందుల వాడకం, దాని దుష్ఫలితాలు, తదితర అంశాలపై మెడికోలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, వైద్యులు డాక్టర్ హైమావతి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఆశాలత, డాక్టర్ పద్మ, డాక్టర్ శ్రావణి, డాక్టర్ ఫర్హానా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు పాల్గొన్నారు.

బడి వేళలు మార్చొద్దు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఉన్నత పాఠశాలల్లో బడి వేళలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగించడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడతారు. ప్రస్తుతం ఉన్న వేళలే కొనసాగించాలని హిందీ సేవా సదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలలకు విద్యార్థులు చుట్టుపక్క 4 నుంచి 5 కిలోమీటర్ల దూరం నుంచి వస్తుంటారన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత పాఠశాలలు వదిలితే ముఖ్యంగా బాలికల భద్రత ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందన్నారు. దీనికితోడు రవాణా కూడా ఇబ్బందిగా ఉంటుందన్నారు. టీచర్లూ ఇబ్బందులు పడతారన్నారు. ప్రస్తుతం ఉన్న 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఇవే వేళలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.